జాప్యం చేయకుండా అందించాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగులకు ప్రతీ నెల భృతి అందిస్తామని ప్రకటించారు. కానీ ఇప్పటి వరకు దానికి సంబంధించిన సమాచారం లేదు. చదువుకుని ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న తమకు భృతి చెల్లిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. జాప్యం చేయకుండా త్వరగా అందివ్వాలి.
– జరజాపు ప్రసాద్, భీమిలి

మాట నిలబెట్టుకోవాలి



నిరుద్యోగులందరికీ ప్రతీ నెల నిరుద్యోగ భృతి ఇస్తామని టీడీపీ నాయకులు ఎన్నికల్లో ప్రచారం చేశారు. వారి మాటలు నమ్మి ఓట్లు వేశాం. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం అర్హులందరికీ నిరుద్యోగ భృతి అందించి మాట నిలబెట్టుకోవాలి. అప్పుడే ప్రభుత్వంపై అందరికీ నమ్మకం పెరుగుతుంది.
– అప్పికొండ కృష్ణ, భీమిలి

నిరుద్యోగ భృతి కోసం ఎదురుచూస్తున్నా



ఉద్యోగం వచ్చేంత వరకు నెలకు రూ.3 వేలు చొప్పున నిరుద్యోగ భృతి అందిస్తామని ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ప్రకటించింది. అయితే అధికారంలోకి వచ్చి నెల రోజులు అవుతున్నా దీనిపై ఉత్తర్వులు జారీ చేయలేదు. నేను బీఎస్సీ, బీఈడీ చేసి ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నా. నిరుద్యోగ భృతి అందిస్తే కాస్త చేయూత లభిస్తుంది. కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించాలి.
– సియాద్రి రవికిరణ్, కొమ్మాది

మాట నిలబెట్టుకోవాలి



ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంట్లో ఎంత మంది నిరుద్యోగులు ఉంటే అందరికీ నిరుద్యోగ భృతి అందిస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. ఆ సమయంలో విద్యార్హత ప్రకటించలేదు. ప్రస్తుతం ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కనీసం డిగ్రీ ఉండాలంటూ, అలాగే మరికొన్ని షరతులు విధించడం సరికాదు. నిరుద్యోగులందరం కూటమి నాయకుల మాటలు నమ్మి ఎన్నికల్లో ఓట్లు వేశాము. ఏదేమైనా ఇచ్చిన మాట తప్పకుండా నిరుద్యోగ భృతి అందరికీ అందించేందుకు చర్యలు తీసుకోవాలి.
– యు.స్వాతి, అమరావతి కాలనీ

చంద్రబాబూ... మరచితివా..?

ఉద్యోగాలైనా ఇవ్వండి... నిరుద్యోగ భృతి అయినా చెల్లించండి



యువతకు ఉపాధి అవకాశాలు, నిరుద్యోగ భృతి చెల్లిస్తామని కూటమి నాయకులు ప్రకటించిన మేనిఫెస్టో

జాబు కావాలంటే బాబు రావాలి అని 2014 ఎన్నికల్లో మాయా మేనిఫెస్టోను అడ్డం పెట్టుకుని చంద్రబాబు అధికారం చేపట్టి నిరుద్యోగులను నిలువునా ముంచేశారు. అనంతరం 2019లో బాబు నిజస్వరూపం తెలుసుకున్న జనం తిరస్కరించారు. మళ్లీ 2024 ఎన్నికల ప్రచారంలో పాతపాటనే కొత్తగా యువనేస్తం పథకం పేరుతో నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇవ్వనున్నట్టు కూటమి నాయకులు ప్రకటించారు. ఈ హామీనైనా అమలు చేయాలని, లేదంటే ఉద్యోగాలైనా కల్పించాలని నిరుద్యోగ యువత ఆశగా ఎదురు చూస్తున్నారు.

- ఆశగా ఎదురుచూస్తున్న నిరుద్యోగులు
- ఎన్నికల హామీ అమలుకు డిమాండ్

తగరపువలస/మధురవాడ/కొమ్మాది/పద్మనాభం/భీమిలి : చదివిన చదువుకు సరైన ఉద్యోగం లభించక ఎందరో నిరుద్యోగులు కూలి పనులు చేసుకుని కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారు. సరైన సమయంలో జాబ్ క్యాలెండర్ ప్రకారం నోటిఫికేషన్లు విడుదల కాకపోవడంతో యువత భవిష్యత్‌పై ఆశలు కోల్పోతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎక్కువగా సచివాలయ ఉద్యోగాలు కల్పించి ఉద్యోగ విప్లవానికి తెరతీశారు. 2,21,003 శాశ్వత ఉద్యోగాలు, 43,923 కాంట్రాక్ట్ ప్రాతి పదికన, 3,73,695 ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు కలుపుకుని మొత్తంగా 6,38,621 మందికి ఉద్యోగాలు కల్పించారు. ఎక్కువగా సచివాలయాలు, వైద్యశాఖలో ఉపాధి కల్పించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీ ప్రకారం భీమిలి నియోజకవర్గంలో నిరుద్యోగ భృతి పొందేందుకు 22 నుంచి 35 ఏళ్ల వయసు కలిగిన వారు 90 వేల మంది వరకు ఉన్నారు. వీరిలో పూర్తిగా నిరుద్యోగులు 43 వేల మంది వరకు ఉన్నారు. కొందరు తాత్కాలికంగా ఉపాధి పొందుతున్నప్పటికీ ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ, డిప్లొమో, ఐటీఐ పూర్తి చేస్తే సరైన ఉపాధి లభించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హెల్పర్లు, కాపలాదారులు, భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తున్నామని వాపోతున్నారు.

హామీ నిలబెట్టుకోవాలి



యువతకు పెద్ద పీట వేస్తామని, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని కూటమి నాయకులు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఆ హామీ అమలు చేస్తారని అంతా నమ్మి ఓట్లు వేశారు. అధికారంలోకి వచ్చాక ఆ మాటే మరిచారు. మాలాంటి వారు ఎంతో మంది ఉపాధి కోసం ఎదురు చూస్తున్నారు. నేను డిగ్రీ పూర్తి చేశాను. జీవనం కోసం చిన్న చిన్న పనులు చేసుకుంటున్నాను. నిరుద్యోగ భృతి చెల్లిస్తామన్న హామీని చంద్రబాబు నిలబెట్టుకోవాలి.
– వాండ్రాసి.శివ శంకర్, నగరంపాలెం

భృతి ఇస్తారని ఆశిస్తున్నాం



అధికారంలోకి వస్తే ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి ఇస్తామని కూటమి నాయకులు చెప్పారు. ప్రతీ మహిళకు రూ.1500 ఆర్థిక సాయం ఇస్తామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి నెల రోజులు దాటినా హామీ అమలు చేసేలా కనిపించడం లేదు. ఉద్యోగాల కోసం అనేక ప్రయత్నాలు చేస్తున్నాం. జీవనోపాధికి అనేక కష్టాలు పడాల్సి వస్తోంది. నేను డిగ్రీ పూర్తి చేశాను.
– నాగోతి గౌరి, మధురవాడ

ఎన్నికల్లో ఆశలు కల్పించారు



నేను డిగ్రీ పూర్తి చేసి, జీవనోపాధి కోసం నిత్యం ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాను. కూటమి నాయకులు యువత కోసం అనేక హామీలు గుప్పించి ఎన్నికల సమయంలో ఆశలు కల్పించారు. అందరితోపాటు మేము కూడా విశ్వసించాం. పరిస్థితి చూస్తే ప్రచార ఆర్భాటమే తప్ప నిరుద్యోగ భృతి, ఉపాధి అవకాశాలు పెంచే మార్గాలు కలిపించడం లేదు. యువతను పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదు.
– వాండ్రాసి వినోద్, చంద్రంపాలెం

యువనేస్తం అమలు చేయాలి



ఎన్నికల మేనిఫెస్టోలో యువనేస్తం పథకం ద్వారా ఇచ్చిన హామీ ప్రకారం కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతితో నిరుద్యోగులను ఆదుకోవాలి. అప్పుడే నిరుద్యోగులకు నమ్మకం ఏర్పడుతుంది. 2014లో జాబు కావాలంటే బాబు రావాలి అనే హామీ ఇచ్చి మోసం చేశారు. ఇప్పుడు కూడా అలా మోసం చేయకుండా నిరుద్యోగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి.
– మన్యాల మోహన్, సంగివలస

ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్నా



టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇంటికో ఉద్యోగం ఇస్తామని చంద్రబాబు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఈ విషయం మేనిఫెస్టోలో కూడా పెట్టారు. ఉద్యోగం ఇచ్చేంత వరకు నిరుద్యోగ భృతి చెల్లిస్తామని చెప్పడంతో అందరం నమ్మాం. ఆ హామీ అమలు చేయడంతోపాటు ఉద్యోగాలు కల్పించాలి.
– కోరాడ శివ, కోరాడ

ఉద్యోగాలు సృష్టించాలి



నేను బీఎస్సీ పూర్తి చేసి ఉద్యోగాల కోసం ప్రయత్నం చేస్తున్నా. చదివిన చదువుకు సరైన ప్లాట్‌ఫారం లభించలేదు. నాలాగే ఎందరో నిరుద్యోగులు ఇలాగే ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు భృతి ఇస్తామని చెప్పి ఎన్నికల్లో గెలిచింది. ఆ హామీని నిలబెట్టుకుంటూ నిరుద్యోగులకు అండగా నిలవాలి.
– చేట్ల చాణక్య, సంతపేట

నిరుద్యోగ భృతి ఇవ్వాల్సిందే



ప్రభుత్వాల నుంచి నిరుద్యోగ భృతి తీసుకోవడం మా అభిమతం కాదు. 20 ఏళ్లకు పైగా మా తల్లిదండ్రులు చెమటోడ్చి చదివించారు. అయినా సరైన ఉద్యోగం రాకపోవడం బాధాకరం. ఇంకా ఉద్యోగ ప్రయత్నాలకు అయ్యే ఖర్చుల కోసం తల్లిదండ్రులపై ఆధారపడకుండా ఉంటానికి కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇవ్వాలి. లేదా సరైన ఉద్యోగ అవకాశాలు కల్పించాలి.
– యు.డి.ఎ.బాలాజీ, తగరపువలస

భృతి కోసం నిరీక్షిస్తున్నాం



బీఎస్సీ చదివి ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్నా. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిరుద్యోగులందరికీ ప్రతీ నెల భృతి చెల్లిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఉద్యోగం లేక ఇబ్బంది పడుతున్న నాలాంటి వారికి నిరుద్యోగ భృతితో కొంత ఆసరా లభిస్తుంది. త్వరగా ఆ పథకం అమలు చేయాలి.
– అట్టాడ రాము, తునివలస

క్లుప్తంగా

ఎండాడలో పాము కలకలం



స్థానికులు పట్టుకున్న నాగుపాము

కొమ్మాది : జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో గల రాజీవ్‌నగర్‌లో నాగుపాము సోమవారం ఉదయం కలకలం రేపింది. ఇది కొండ ప్రాంతం కావడంతో ఇటీవల కురిసిన వర్షాలకు పాములు నివాసాల్లోకి చొచ్చుకుని వస్తున్నాయి. నాగుపాము ఓ ఇంటిలోకి రావడంతో స్థానిక యువకులు చాకచక్యంగా పట్టుకుని జన సంచారం లేని ప్రాంతంలో విడిచిపెట్టారు.

ద్విచక్ర వాహనదారులపై కేసులు



కారుషెడ్ కూడలిలో వాహనాలు తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

పీఎం పాలెం: ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఆనందపురం, పీఎంపాలెం పోలీస్ స్టేషన్ల పరిధిలోని కారుషెడ్ కూడలి, కొమ్మాది, మారికవలస కూడళ్లలో ట్రాఫిక్ పోలీస్‌లు సోమవారం తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు అతిక్రమించిన సుమారు 200 మందిపై కేసులు నమోదు చేశామని స్థానిక ట్రాఫిక్ ఎస్‌ఐ వెంకటరావు తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించే వారిపై పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఆనందపురం ట్రాఫిక్ ఎస్‌ఐ అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

వర్షంతో వరి నారుకు మేలు



మద్ది గ్రామంలో జీవం పోసుకున్న వరి నారు

పద్మనాభం : మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం వర్షం కురిసింది. దీంతో వరి నారుకు మేలు చేకూరింది. మద్ది, తునిపాలెం గ్రామాల్లో వరి నారు వేసి పది రోజులవుతున్నా వర్షం కురవలేదు. ఎండలు ఎక్కువగా కాయడంతో వరి నారు వడలిపోతోంది. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం కురిసిన వర్షంతో వరి నారు జీవం పోసుకుంది.

వర్షంతో రైతుల హర్షం

తగరపువలస : ఆనందపురం మండలంలో సోమవారం కురిసిన వర్షానికి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి నాట్లుకు సిద్ధంగా ఉన్న సమయంలో రుతు పవనాలు వచ్చి రెండు వారాలకు పైగా గడచినా వర్షం జాడ లేకపోవడంతో రైతులు ఆకాశం వైపు ఆశగా చూస్తున్నారు. సోమవారం నాటి వర్షంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. గెడ్డల ద్వారా నీరు చెరువులలోకి చేరింది. ఆనందపురం మండలం పొడుగుపాలెం పెద్ద గెడ్డ నుంచి నీరు మర్రి చెరువు, దొంతలవాని చెరువు, పూర్ణవాని చెరువుల్లోకి చేరింది.

కార్మికవాడలో అంధకారం

తగరపువలస : చిట్టివలస కార్మికవాడలో అంధకారం నెలకొనడంతో స్థానిక కార్మిక కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అంబేడ్కర్ కూడలి నుంచి చావుల మదుము రోడ్డు వరకు ఒక్క వీధి దీపం కూడా వెలగక పోవడంతో చిమ్మచీకట్లు అలముకున్నాయని వాపోతున్నారు. ఈ ప్రాంతంలో జులాయిల తాకిడి, చిల్లర దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని, కొత్తగా వీధి దీపాలు అమర్చాలని స్థానికులు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకునికి పరామర్శ



గణేష్‌రెడ్డిని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ భీమిలి ఇన్‌చార్జి మహేష్, నాయకులు

తగరపువలస : ఇటీవల భీమిలి – తగరపువలస రహదారిలో పశువుల దాడిలో తీవ్రంగా గాయపడి సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు చిల్ల గణేష్ రెడ్డిని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్ సోమవారం పరామర్శించారు. గణేష్‌రెడ్డి శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనంపై వస్తుండగా జీరుపేట వద్ద పశువులు అడ్డగించి కొమ్ములతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా గణేష్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, సీనియర్ నాయకుడు చిల్ల బాబయ్యరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. రోడ్లపై తిష్ట వేసిన పశువులను కట్టడి చేయడంలో జీవీఎంసీ, ప్రభుత్వం విఫలమయ్యాయన్నారు. ఇప్పటికైనా రోడ్లపై పశువులను నియంత్రించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని మహేష్ డిమాండ్ చేశారు.

మందుబాబులకు రూ.2.90 లక్షల జరిమానా

తగరపువలస : భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కిన 29 మందికి భీమిలి 15వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ డి.సౌజన్య సోమవారం ఒక్కొక్కరికి రూ.10 వేల వంతున మొత్తం రూ.2.90 లక్షలు జరిమానా విధించారని భీమిలి ట్రాఫిక్ ఎస్‌ఐ చింతలపూడి చిరంజీవిరావు తెలిపారు.

పీఎం పాలెం : మద్యం సేవించి ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తున్న 24 మందికి న్యాయస్థానం రూ. 48 వేలు జరిమానా విధించింది. ఇందుకు సంబంధించి పీఎం పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ వెంకటరావు వివరాలు తెలిపారు. జాతీయ రహదారిపై ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో పోలీసులకు పట్టుబడిన 24 మందిపై కేసులు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ.2 వేలు నుంచి రూ.3 వేలు చొప్పున మొత్తం 48 వేలు జరిమానా విధించారని ఎస్‌ఐ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల ఆత్మీయ సమావేశం



కృష్ణంరాజుపేటలో సమావేశమైన వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు

తగరపువలస : వైఎస్సార్‌సీపీ భీమిలి మండల పార్టీ నాయకుల ఆత్మీయ సమావేశం సోమవారం శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేటలో నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు కలిసి ప్రజాప్రతినిధులు, నాయకుల యోగ క్షేమాలు తెలుసుకున్నారు. ఎవరూ అధైర్యపడొద్దని, తిరిగి వైఎస్సార్‌సీపీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు లచ్చుబుగత జగదీశ్వరరావు, కరుభుక్త అప్పలనారాయణ, పొట్నూరు చంద్రశేఖర్, పల్లా సన్యాసిరావు, ఉండబట్ల చిన్నారావు, బొద్దు దుర్గారావు, మేరుగు ఎల్లాజీ, తుపాకుల అప్పలరాజు, తుపాకుల అప్పలస్వామి, ముద్దాడ సూరప్పడు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



సీసీ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు రామునాయుడు

తగరపువలస : జీవీఎంసీ ఒకటో వార్డు కొత్తపేటలో రొక్కం శ్రీను ఇంటి నుంచి గుడివాడ వంతెన అప్రోచ్ రోడ్డు వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి సోమవారం పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ హయాంలో జీవీఎంసీలో డ్రైనేజీలు, రోడ్లు ఎక్కువగా నిర్మించామన్నారు. ఇక్కడ సీసీ రోడ్డు, డ్రైనేజీల నిర్మాణానికి జీవీఎంసీ నుంచి రూ.25 లక్షల నిధులు ఖర్చు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రొక్కం శ్రీను, గిడుతూరి వెంకటరావు, మునకాల తేజేశ్వరరెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అనధికార బడ్డీలు తక్షణమే తొలగించాలి



వినతులు స్వీకరిస్తున్న అప్పలరాజు

మధురవాడ : జీవీఎంసీ 7వ వార్డు నగరంపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డులో మధురవాడ క్వారీ సొసైటీకి చెందిన స్థలంలో అనధికార బడ్డీలు తక్షణమే తొలగించాలని ఏఐటీయూసీ అనుబంధ మధురవాడ క్వారీ సొసైటీ సెక్రటరీ వాండ్రాసి రవికుమార్ తదితరులు వినతిపత్రమిచ్చారు. మధురవాడ జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో సూపరింటెండెంట్ అప్పలరాజు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అలాగే కొమ్మాదిలో తాగునీటి కుళాయిలకు ట్యాప్‌లు, వీధిలైట్ల ఏర్పాటు, తదితర సమస్యలపై 15 అర్జీలు వచ్చాయి. వీటిని జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి తక్షణ చర్యలు చేపడతామని అప్పలరాజు చెప్పారు.

భీమునిపట్నం : స్థానిక జోనల్ కార్యాలయం వద్ద సోమవారం జెడ్సీ కనక మహాలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు (పీజీఆర్ఎస్) మూడు వినతులు వచ్చాయి. పరిశీలించి చర్యలు తీసుకుంటామని జెడ్సీ తెలిపారు.

అక్రమ నిర్మాణాలు తొలగించాలని వినతి

తగరపువలస : ఆనందపురం మండలం కణమాం రెవెన్యూ సర్వే నంబర్ 50లోని ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు తొలగించాలని కోరుతూ యాత కణమాం గ్రామానికి చెందిన చందవరపు ప్రకాష్ సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)లో ఫిర్యాదు చేశాడు. ఇక్కడ జగనన్న కాలనీని ఆనుకుని ప్రభుత్వ భూమిలో యర్ర కన్నారావు, యర్ర రవీంద్రబాబు మరికొందరు వ్యక్తులు సుమారు 200 గజాల ప్రభుత్వ స్థలంలో అనుమతులు లేకుండా మూడు ఫ్లోర్ల నిర్మాణాలు చేపడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో అధికారుల సాయంతో ఇక్కడ ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపట్టి 20 వరకు ప్లాట్లు విక్రయించారన్నారు. వీటిపై విచారణ జరిపించి ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపట్టిన వారిపై, గతంలో నిర్మించి విక్రయాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరినట్టు ప్రకాష్ తెలిపాడు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు



మాట్లాడుతున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం : పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు పారిశుధ్యం నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీపీ కంటుబోతు రాంబాబు సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఎంపీడీవో బి.శైలజ ఆధ్వర్యంలో పద్మనాభం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ వర్షాలు కురుస్తుండడంతో వ్యాధులు ప్రబలే ప్రమాదమున్నందున అన్ని గ్రామాల్లోనూ పారిశుధ్యం మెరుగుపరచాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలని కోరారు. రెడ్డిపల్లి బాలికల వసతి గృహంలో భోజనం బాగోలేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. పాండ్రంగి రైతు భరోసా కేంద్రాన్ని తెరిచి ఉంచాలని సూచించారు. గంధవరం సర్పంచ్ జి.వి.కె.కె.వర్మ మాట్లాడుతూ కొవ్వాడ, గంధవరం గ్రామాల్లో కుక్కలకు రేబిష్ వ్యాక్సిన్ వేయలేదన్నారు. తమ గ్రామాల్లో రోడ్డు విస్తరించడానికి తాగునీటి పైప్‌లైన్‌ను తవ్వేయడంతో ప్రజలకు నీరు అందించలేని పరిస్థితి నెలకొందని శేరిఖండం సర్పంచ్ పల్లంటి చిన్నారావు, రెడ్డిపల్లి ఉప సర్పంచ్ సిరుగుడి ఆదినారాయణ ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులపై మండిపడ్డారు. సమావేశంలో వైస్ ఎంపీపీ ఈర్ల రాజేశ్వరి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, ఏవో ఎంవీఎస్ చలం, ఎంఈవో పి.రమణ, ఏపీవో జి.వరలక్ష్మి, ఏపీఎం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు జోనల్ కార్యాలయం ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..



మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

మధురవాడ : ఎట్టకేలకు మధురవాడ జోనల్ కార్యాలయం ప్రారంభించారు. పూర్తిగా పాతబడిన జోనల్ కార్యాలయం పునర్నిర్మాణం, మరమ్మతుల కోసం గత ఏడాది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.50 లక్షలు మంజూరు చేసింది. ఆ నిధులతో నెల రోజుల క్రితమే పనులు పూర్తయినా అధికారులు ప్రారంభించలేదు. జోనల్ కమిషనర్ చాంబర్ వినియోగంలోకి రాకపోవడంతో అధికారులు, సందర్శకులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై 'ముహూర్తం చిక్కలేదా..!' శీర్షికతో సాక్షి పత్రికలో సోమవారం కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో సోమవారం సాయంత్రం ప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విశాఖ నగరం – భోగాపురం ఎయిర్‌పోర్టు మధ్య ఉన్న మధురవాడ ప్రాంతం మాధాపూర్, గచ్చిబౌలిలా అభివృద్ధి చెందుతుందన్నారు.

తాగునీరు సక్రమంగా రావడం లేదు

ప్రస్తుతం మధురవాడలోని పలు ప్రాంతాల్లో తాగునీరు సక్రమంగా రావడం లేదని, గత ప్రభుత్వంలోనే బాగా వచ్చేదని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వద్ద టీడీపీ నాయకుడు, 7వ వార్డు కార్పొరేటర్ భర్త పిళ్లా వెంకటరావు వాపోయారు. ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో జెడ్సీ శైలజావల్లి, ఈఈ శాంతి రాజు, ఏఈలు శ్రీనివాస్, సురేష్, నాయకులు కోరాడ రాజబాబు, విజయబాబు, కార్పొరేటర్లు హేమలత, మంగమ్మ, చిన్ని కుమారి పాల్గొన్నారు.